వయోవృద్ధుల సంక్షేమానికి కృషి

నిర్మల్, న్యూస్‌టుడే: వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాల్లో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. వారం రోజులపాటు వయోవృద్ధుల వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వృద్ధాశ్రమాల్లో క్రీడ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తల్లిదండ్రుల పోషణ, ఆరోగ్య సంరక్షణపై అవగాహన ర్యాలీలు, సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టం-2007పై అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్ డేను నిర్వహించాలని, అక్టోబరు 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా జరపాలన్నారు. వయోవృద్ధులకు ఆరోగ్య సంరక్షణ, సామాజిక భద్రత, చట్టపరమైన రక్షణ, న్యాయ సలహాలు అందించాలన్నారు. సమాజంలో వృద్ధులను గౌరవిస్తూ వారి శ్రేయస్సు కోసం కృషి చేయాలన్నారు. వయోవృద్ధుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వృద్ధుల గౌరవం, శ్రేయస్సు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ నియమావళికి సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. అనంతరం వయోవృద్ధులను సన్మానించారు. జిల్లా అదనపు పాలనాధికారి ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకల్యాణి, జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, వెనుకబడిన తరగతుల సంఘ జాతీయ కార్యదర్శి ఎం.సి.లింగన్న, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్, చిత్రంలో అదనపు పాలనాధికారి ఫైజాన్ అహ్మద్

'ఉద్దేశపూర్వకంగానే తిరుపతి లడ్డూ కల్తీ'

నిర్మల్ పట్టణం: హిందువుల మనోభావాలను, ఆలయ పవిత్రతను దెబ్బతీసేందుకు కావాలనే తిరుపతి ప్రసాద లడ్డూను కల్తీ చేశారని సనాతన ధర్మ పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు మెడిసెమ్మె రాజు, రాఘవులు, గుణవంత్‌రావు, పోలిశెట్టి విలాస్, ప్రవీణ్‌శర్మ, రాజేశ్వర్, నారాయణ పాల్గొన్నారు.

కేజీబీవీలో విద్యార్థినులను కొరికిన ఎలుకలు

ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మస్కాపూర్ కేజీబీవీలో విద్యార్థులను ఎలుకలు కొరికిన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. విద్యార్థులు పడుకునే గదుల్లో ఎలుకలు భారీగా పెరిగిపోయి దాడులు చేస్తున్నా నియంత్రణకు చర్యలు చేపట్టడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహించారు. దీనిపై 'న్యూస్‌టుడే' పాఠశాల ప్రత్యేక అధికారి సునీతరాణిని సంప్రదించగా, గత గురువారం నుంచి విద్యార్థులు పడుకునే గదిలో ఎలుకలు దూరి రోజుకు కొంతమంది చొప్పున మొత్తం 8 మంది విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయులను స్వల్పంగా గాయపరిచాయని ఆమె చెప్పారు. వారికి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించామని తెలిపారు. ఎలుకల నియంత్రణకు బోనులు ఏర్పాటు చేశామని, వాటి నివారణకు చర్యలు చేపడుతున్నామని వివరించారు.

పునరావాస గ్రామ సందర్శన

కడెం, న్యూస్‌టుడే: ఇటీవల పునరావాసం పొందిన మైసంపేట, రాంపూర్ కొత్త గ్రామాన్ని బుధవారం కవ్వాల్ పెద్దపులుల సంరక్షణ కేంద్రం ఎఫ్‌డీపీటీ (ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్) శాంతారాం సందర్శించారు. గిరిజనులతో సమావేశమైన ఆయన కొత్త కాలనీలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సాగు భూమిని ఇంకా తమకు అందజేయలేదని, భూమిని చదునుచేసి పట్టాలివ్వాలని గిరిజనులు ఆయనను కోరారు. పట్టాలిప్పిచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, భూమి చదును సైతం చేయించి ఇస్తామన్నారు. నిర్మల్ డీఎఫ్‌ఓ షేక్ నాగిని భాను, ఎఫ్‌డీఓ భవాని శంకర్, ఎఫ్ఆర్వో గీతారాణి, ఎఫ్ఎస్‌ఓ రవికుమార్, హిటికాస్ సమన్వయకర్త వెంకట్ పాల్గొన్నారు.

నూనెలు సలసల.. పండగ ఎలా?

న్యూస్‌టుడే, రాంనగర్, ఇంద్రవెల్లి

తెలుగిళ్లలో పెద్ద పండగలు దసరా, దీపావళీ, సంక్రాంతి వరుసగా రాబోతున్నాయి. సరిగ్గా ఈ సమయంలోనే నూనెలు, పప్పుల ధరలు అమాంతం పెరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. పండగలు అంటేనే.. సకినాలు, గారెలు, బూరెలు, అరిసెలు చేసుకోవడం ఆనవాయితీ. నగరాల్లో ఉండే వారు కూడా సెలవుల్లో ఇంటికి వస్తారు. వాళ్లకు ఇష్టమైనవి చేసి పెట్టాలని ఉంటుంది. నూనె సెగలతో కుటుంబాలపై అదనపు భారం పడుతోంది.


ఉమ్మడి జిల్లాలో ప్రతి నెల 40 లక్షల లీటర్ల నూనె వినియోగిస్తారు. నిరుపేదలతో పాటు హోటళ్లలో పామాయిల్ వినియోగం అధికంగా ఉంటుంది. ఇతర నూనెల ధరలతో పోలిస్తే లీటరుకు రూ.20-30 తక్కువగా ఉండటంతో వీటిని వినియోగిస్తారు. ఇటీవల ఆరోగ్యంపై శ్రద్ధతో బ్రౌన్ రైస్ నూనె, ఆలివ్ ఆయిల్, కొబ్బరినూనెల వినియోగం పెరిగింది. బ్రాండెడ్ పేరిట కొన్నింటిని లీటరు 200లకు పైగా విక్రయిస్తున్నారు.

జిల్లాలో కుటుంబాలు : 8.50 లక్షలు

జనాభా: 28 లక్షలు

నూనె నెల వినియోగం : 40 లక్షల లీటర్లు

కుటుంబాలపై పడే అదనపు భారం: రూ. 8 కోట్లు



నూనెల ధరలు

	వారం కిందట	ప్రస్తుతం
వేరుశనగ	120	150
సన్‌ఫ్లవర్	110	130
పామాయిల్	95	115
ఇతర నూనెలు	100	135
నాణ్యమైన నూనె(గానుగ)	315	340

ధరలను నియంత్రించాలి

అరుణ, గృహిణి, శాంతినగర్



పెరుగుతున్న ధరలను ప్రభుత్వం నియంత్రించాలి. ప్రభుత్వాలు పన్నులు పెంచిన ప్రతి సారి ఆ భారం నేరుగా ప్రజలపైనే వేస్తున్నారు. దిగుమతి సుంకం పెరిగితే కంపెనీలు 50 శాతం కూడా భరించకుండా నేరుగా ధరలు పెంచేసి వినియోగదారులపైనే భారం మోపడం ఎంత వరకు సమంజసం.

దిగుమతి సుంకం పెరగడంతోనే..

నూనెల ధరలు లీటరుకు సగటున రూ.20 పెరిగాయి. దిగుమతి సుంకం పెరగడంతోనే ధరలు పెరిగాయని నూనె వ్యాపారి సురేశ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూనెలపై సుంకాన్ని భారీగా పెంచడంతో సంస్థలు ఆ భారాన్ని ప్రజలపైనే మోపాయని ఆయన పేర్కొన్నారు. ముడిసరకుగా దిగుమతి చేసుకునే వంట నూనెలకు(క్రూడ్ ఆయిల్) గతంలో 12.5 శాతం సుంకం ఉండేది. తాజాగా కేంద్ర ప్రభుత్వం దీన్ని 32.5 శాతానికి పెంచడంతో భారం పెరిగిపోయింది. ఒక్కో కుటుంబం సగటున అయిదు లీటర్ల నూనెను వినియోగిస్తారు. ఈ లెక్కన నెలకు కుటుంబంపై రూ.100 అదనంగా భారం పడుతోంది.



సామాన్యులపై భారమే

టేకం భీంబాయి, మొలలగుట్ట, ఇంద్రవెల్లి మండలం

ధరల పెరుగుదలతో సామాన్యులపై భారం పడుతోంది. గత నెల కంటే లీటరుకు రూ.20 నుంచి రూ.30 ధర పెరిగింది. సంతలో నాసిరకం కంపెనీల నూనె తీసుకొచ్చి అదే ధరతో విక్రయిస్తున్నారు. నూనెలు రేషన్ దుకాణాల్లో అందుబాటులో ఉంచి, రాయితీపై విక్రయిస్తే మాలాంటి పేదోళ్లకు కొంత మేలు జరుగుతుంది.

అంకితభావంతో పనిచేయాలి : ఎస్పీ

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: శిక్షణలో భాగంగా నిర్మల్ జిల్లాకు ఏడుగురు ఎస్సైలను కేటాయించారు. ఈ మేరకు జిల్లా పోలీసు అధికారి డా.జి.జానకి షర్మిలను బుధవారం వారు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎస్పీ అందరికీ అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలగాలని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో నిర్వర్తించే అన్నిరకాల విధులపై అవగాహన పెంచుకోవాలన్నారు.



శిక్షణ ఎస్సైలతో ఎస్పీ జానకి షర్మిల

ఖానాపూర్‌లో వర్షం



ఖానాపూర్, న్యూస్‌టుడే: ఖానాపూర్ పట్టణంలో బుధవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రాత్రి 7:30 గంటలకు ప్రారంభమైన వాన మధ్య విరామమిస్తూ 10 గంటల వరకు కురిసింది. రహదారులపై వర్షపునీరు వరద పారింది. పట్టణంలోని జీపుఅడ్డా, తహసీల్దార్ కార్యాలయం వద్ద రహదారిపై నీరు నిలిచింది.

కుట్టు కూలీ భత్యం మంజూరు

విద్యాలయాలు	విద్యార్థులు	కుట్టుకూలీ (రూ.లలో..)
742	47,685	23,84,250

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: ఏకరూప దుస్తుల ఒక జత కుట్టుకూలీ భత్యం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి తెలిపారు. ఒక్కో జతకు రూ.50 చొప్పున విడుదల చేయగా వాటిని అమ్మ ఆదర్శ పాఠశాల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. విద్యాలయాల ప్రధానోపాధ్యాయులు వీవో ఛైర్మన్ ఆధ్వర్యంలో డబ్బులు డ్రా చేసి కుట్టించి ఇచ్చిన స్వయం సహాయక సంఘ సభ్యులకు అందజేయాలని వెల్లడించారు. ఆ వివరాలను సంబంధిత మండల విద్యాధికారులకు అందజేయాలని చెప్పారు. దసరా సెలవులలోగా రెండో జత దుస్తులను కుట్టించి ఇచ్చేలా ప్రత్యేకత కనబర్చాలని సూచించారు.

'ఆ ఉపాధ్యాయులను తొలగించాలి'

నిర్మల్, న్యూస్‌టుడే: యూబిట్ కాయిన్ వ్యవహారంలో ఆర్థిక నేరాలకు పాల్పడ్డ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడంతోపాటు సస్పెండ్ చేయాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శంకర్ కోరారు. బుధవారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. ఈ దందాలో ఉండి ఉపాధ్యాయ సంఘాల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు దృష్టి సారించాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా 88 మందిని రిలీవ్ చేయడంతో ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. జిల్లా విద్యాధికారిపై నమ్మకం లేనందున జిల్లా అడ్మినిస్ట్రేటివ్‌గా ఉన్న కలెక్టర్ చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ఆర్జీయూకేటీలో భద్రత గాలికి

● గోడదూకి బయటకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులు

ముథోల్(బాసర), నిర్మల్, న్యూస్‌టుడే:

బాసర ఆర్జీయూకేటీలో భద్రత వైఫల్యాలు వెక్కిరిస్తున్నాయి. వందమంది భద్రత సిబ్బంది ఉన్నా సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తరచూ ఏదో ఒక సంఘటన జరుగుతోంది. తాజాగా భద్రత సిబ్బంది కళ్లు గప్పి ఇద్దరు విద్యార్థులు గోడ దూకి బయటకు వెళ్లిపోయారు.

బాసరలోని విశ్వవిద్యాలయంలో 9 వేల మంది విద్యార్థులు ఉంటారు. వీరి భద్రత కోసం గతంలో డీఎస్పీ, సీఐ, ఎస్సైతోపాటు పది మంది పోలీసులు, వంద మంది భద్రత సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం ఓ సీఐ మాత్రమే భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ఏడాది క్రితం ఓ యువకుడు ఓ విద్యార్థిని కోసం ప్రాంగణంలోకి గోడదూకి వచ్చాడు. ఆమె బంధువులకు సమాచారం తెలిసి వారు భద్రత సిబ్బందికి చెప్పడంతో యువకుడిని గుర్తించి బాసర పోలీసులకు అప్పగించారు. కొందరు విద్యార్థులు గంజాయి లోపలికి తెచ్చుకుని మరుగుదొడ్లలో పొగ తాగుతుంటే వాసన వచ్చిన తోటి విద్యార్థులు పోలీసులకు సమాచారం అందిస్తే అప్పుడు భద్రత సిబ్బంది పట్టుకున్నారు. ఇటీవల గణేశ్ నిమజ్జనం శోభాయాత్రలో సీనియర్, జూనియర్ విద్యార్థులు కొట్టుకున్నారు. తాజాగా ఇంజినీరింగ్ మూడో సంవత్సరం విద్యార్థులు మంగళవారం అర్ధరాత్రి రెండో గేటు పక్కన విద్యుత్తు ఉపకేంద్రం పక్క నుంచి గోడదూకి బయటకు వెళ్లారు. ఓ విద్యార్థి ఫెయిలైన సబ్జెక్టుల పరీక్షలు రాయడానికి వచ్చాడు. మరో విద్యార్థి ఆయనతో పాటు బయటకు వెళ్లాడు. బాసర గస్తీ పోలీసులకు అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులు కనిపించడంతో వారు ఆరాతీశారు. వారు చెప్పిన వివరాల ప్రకారం తిరిగి ఆర్జీయూకేటీ భద్రత సిబ్బందికి అప్పగించారు.



బాసర ఆర్జీయూకేటీ

భద్రత సిబ్బంది కొరతతో పాటు పర్యవేక్షణ అధికారుల లేకపోవడంతో అంతా ఇష్టారాజ్యంగా మారింది. పది రోజుల కిందట ఆర్జీయూకేటీ సీఐ రాకేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి సెలవులో ఉన్నారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి బాధ్యతలు ఎవరికీ ఇవ్వలేదు. మొత్తం 150 మంది భద్రత సిబ్బంది ఉండాలి. కానీ వంద మందితోనే నెట్టుకొస్తున్నారు. వీరితో మూడు షిఫ్టులలో పనిచేయిస్తున్నారు. షిఫ్టుకు 50 మంది అవసరం. కానీ సిబ్బంది కొరతతో 30-40 మందితో భద్రత విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వారు అన్ని ప్రాంతాల్లో నిఘా పెట్టలేకపోతున్నారు. ఆర్జీయూకేటీలో భద్రత పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఉన్నా వాటిని వీక్షించే సిబ్బంది లేరు. ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే వాటిని పరిశీలిస్తున్నారు.

మా దృష్టికి వచ్చింది:

రణధీర్, పరిపాలనాధికారి

విద్యార్థులు బయటకు వెళ్లిన విషయం మా దృష్టికి వచ్చింది. ఎందుకు, ఎలా వెళ్లారనే దానిపై విచారణ చేస్తున్నాం. పూర్తి విషయాలు తెలుసుకుంటాం. అర్ధరాత్రి గోడదూకి బయటకు వెళ్లాల్సిన అవసరం ఏముందనే దానిపై ఆరా తీస్తున్నాం. ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటాం.



దిలావర్‌పూర్‌లో మాట్లాడుతున్న గ్రామస్థులు

ప్రజాభిప్రాయానికి విలువ ఇవ్వండి

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే: దిలావర్‌పూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ పరిశ్రమపై ప్రజాభిప్రాయానికి విలువ ఇవ్వాలని రైతులు, పరిశ్రమ వ్యతిరేక కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం దిలావర్‌పూర్ బస్టాండ్ సమీపంలో 65వ రోజు రిలే నిరాహారదీక్ష కొనసాగించి మాట్లాడారు. ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో పరిశ్రమ ఏర్పాటుతో జరిగే అనర్థాలపై తాము లేవనెత్తిన సందేహాలకు పూర్తి వివరణ ఇవ్వకుండానే అధికారులు సమావేశం ముగించారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ ఏర్పాటు చేసే స్థలంలో సమావేశం నిర్వహించి సందేహాలకు వివరణ ఇవ్వాలని కోరారు. పరిశ్రమను తరలించాలని గుండంపల్లి గ్రామంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష 22 రోజులకు చేరుకుంది.

అనుమానితుడిని పట్టుకున్న గ్రామస్థులు

ముథోల్(బాసర): బాసర వారసంతలో చరవాణిలను దొంగిలించాడనే అనుమానంతో ఓ వ్యక్తిని గ్రామస్థులు పట్టుకున్నారు. కొన్ని రోజులుగా వారసంతలో చరవాణిలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరిస్తున్నారు. గ్రామస్థులు నిఘా పెట్టి బుధవారం సాయంత్రం ఓ వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

ఉద్యోగ ధర్మాన్ని అంకితభావంతో నిర్వహించే అధికారులు కొందరైతే.. ప్రజల అవసరాలను గుర్తించి వారికి ఉపయోగపడే పనుల కోసం అహర్నిశలు పాటుపడే వారు మరికొందరు. ఆ కోవకే చెందుతారు ఈ నలుగురు ఐఏఎస్ అధికారులు. ఉట్నూరు ఐటీడీఏ పీవోలుగా విద్యా, వైద్యం, ఉపాధితో పాటు కనీస సదుపాయాలు వారికి అందేలా చేసి అడవిబిడ్డల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. వీరి సేవలను నిత్యం యాది చేసుకుంటూనే ఉన్నారు ఇక్కడి గిరి'జనం'. వారే ముత్యాల రాజు, జనార్దన్ నివాస్, ఆర్వీ కర్ణన్, వరుణ్‌రెడ్డి. -న్యూస్‌టుడే, ఉట్నూరు

వీరి చిత్తశుద్ధి.. కావాలి ఇతరులకు స్ఫూర్తి

● ఈ ఐఏఎస్‌ల కృషి చిరస్మరణీయం

సాంకేతికత ఈయన చొరవే



ఉట్నూర్-లాల్‌టెకిడిలోని ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాల



ముత్యాల రాజు

ముత్యాల రాజు ఐఏఎస్ ఆల్ ఇండియా టాపర్‌గా నిలిచిన ఈ అధికారి 31.03.2011 నుంచి 09.10.2012 వరకు ఇక్కడ పీవోగా పని చేశారు. పని తీరులో పారదర్శకత, నిర్ణయం తీసుకోవడంలో వేగం ఈయన సొంతం. పదో తరగతి పూర్తయ్యాక గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని గుర్తించి ఉట్నూరులో గురుకుల జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేశారు. సాంకేతిక విద్యా మండలితో మాట్లాడి ఉట్నూర్-లాల్‌టెకిడిలో ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాల నెలకొల్పడంలో సఫలీకృతులయ్యారు.

ప్రధాని మెచ్చిన అవ్వాల్ సేవలు



గర్భిణిని అంబులెన్స్‌లో తీసుకెళ్తూ..



జనార్దన్ నివాస్

ఐటీడీఏ పీవోగా 2013 నుంచి 2014 వరకు పని చేసిన జనార్దన్ నివాస్ మారుమూల గిరిజనులకు మెరుగైన వైద్యమందించేందుకు విశేషంగా కృషి చేశారు. మాతా, శిశు మరణాలలో ఉమ్మడి ఆదిలాబాద్ దేశంలోనే మూడు, నాలుగు స్థానాలలో ఉండేది. ఈ గణాంకాలను చూసి దిగ్భ్రాంతికి గురైన పీవో జనార్దన్ నివాస్ గర్భిణులకు ఉచితంగా అంబులెన్స్ సేవలను అందించే అవ్వాల్(గోండి భాషలో అమ్మ) పేరుతో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టారు. ఐటీడీఏలో కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఎంతో గుర్తింపు పొందిన ఈ సేవలు కేంద్ర ప్రభుత్వాన్ని ఆకర్షించాయి. ప్రధాని మోదీ ఆయన సేవలను ప్రశంసించారు.



ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేయాల్సిన బాధ్యత ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిపై ఉంది. ఐటీడీఏ స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు అనేక మంది పీవోలు పని చేశారు. అందులో కొందరు ఉత్తమ సేవలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు. 1987 నుంచి 1990 వరకు మూడేళ్లపాటు ఐటీడీఏ పీవోగా పని చేసిన పి.సుబ్రహ్మణ్యం ఆదివాసీ హృదయాలను గెలిచారు. గోండి భాషను నేర్చుకొని వారికి చక్కటి సేవలందించారు. ఆ తరువాత రెండు దశాబ్దాల తర్వాత నలుగురు అధికారులు సేవలతో ప్రత్యేక గుర్తింపు పొందారు.



'నీ కోసం జీవిస్తే నీలోనే జీవిస్తావు జనం కోసం జీవిస్తే జనంలో నిలిచిపోతావు' - డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

'గిరి' దివ్యాంగులకు వికాసం



ఉట్నూరులో ఏర్పాటుచేసిన వికాసం పాఠశాల



ఆర్వీ కర్ణన్

మూడేళ్ల ఐటీడీఏ పీవోగా పని చేసిన ఆర్వీ కర్ణన్ విస్తృతంగా క్షేత్రస్థాయిలో పర్యటించి గిరిజనులతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆదివాసీ, గిరిజన దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక బడి లేక వారు చదువులకు దూరమవుతున్నారని గుర్తించారు. ఛత్తీస్‌గఢ్‌లోని సక్షం పాఠశాలలకు దీటుగా ఉట్నూరులో వికాసం ప్రత్యేక బాలల బడిని ఏర్పాటు చేశారు. అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చారు. రాష్ట్రంలో తొలి గిరిజన దివ్యాంగ పాఠశాలగా ఈ బడి గుర్తింపు పొందింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పాఠశాలను ఇన్నోవేషన్ పురస్కారంతో సత్కరించింది.

అక్షర జ్యోతి.. యువతకు ఉపాధి

ఏడాది కాలం ఐటీడీఏ పీవోగా పని చేసిన వరుణ్‌రెడ్డి గిరిజన విద్యార్థుల చదువులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. వారిలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు 'అక్షర జ్యోతి' కార్యక్రమం చేపట్టి విద్యార్థులు చదువుల్లో రాణించేలా ప్రతి వారం పరీక్షలు, సబ్జెక్టుల్లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ మంచి ఫలితాలు సాధించేలా ప్రోత్సహించారు. ఇంజినీరింగ్, ఐఐటీ చదువుతున్న పేద విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా ఉచితంగా ల్యాప్‌ట్యాప్‌లను అందజేశారు. గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారు.



గిరిజన విద్యార్థికి ల్యాప్‌ట్యాప్‌ను అందజేస్తున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

మరో ముగ్గురు ఉపాధ్యాయులు..!

● ఆన్‌లైన్ పెట్టుబడుల వ్యవహారంలో అరెస్టు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో కలకలం సృష్టించిన యూబిట్ క్రిప్టోకరెన్సీ మోసం కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. విచారణలో భాగంగా ఇప్పటికే అయిదుగురిని రిమాండ్‌కు పంపిన పోలీసులు తాజాగా మరో ముగ్గురు ఉపాధ్యాయులను అరెస్టు చేశారు. వారిని బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఇందులో దాసరి రమేశ్ (కడెం మండలం కన్నాపూర్ పాఠశాల), కిరం వెంకటేశ్ గౌడ్ (కుభీరు మండలం దౌజీనాయక్ తండా పాఠశాల), బొమ్మిడి ధనుంజయ్ (ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సొనాల పాఠశాల) ఉన్నారు.

ఖాతాల స్తంభన..

ఆన్‌లైన్ పెట్టుబడులతో అధిక రాబడులు వస్తాయని తప్పుడు వాగ్దానాలు చేస్తూ పెట్టుబడిదారులను ప్రలోభాలకు గురిచేస్తున్నారనేది ఈ కేసులో ప్రధాన ఆరోపణ. పిరమిడ్ తరహాలో ఈ పథకాన్ని విస్తరించడంలో స్టార్ గుర్తింపు ఉన్న సభ్యులు క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారని పోలీసులు గుర్తించారు. విచారణలో భాగంగా ఈ పథకంతో ముడిపడిఉన్న 11 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. అనుమానం ఉన్న ఖాతాల్లో ఆర్థిక లావాదేవీలు పరిశీలిస్తూనే, ఆస్తుల గుర్తింపు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. అయితే.. కేసు దర్యాప్తులో భాగంగా నిధుల దుర్వినియోగం నిరోధించేందుకు, బాధితుల సొమ్ముకు భద్రత కల్పించేందుకు ఈ దశ కీలకంగా మారుతుందని పోలీసులు పేర్కొంటున్నారు.

రహస్య సమావేశాలు..

ఈ వ్యవహారంలో భాగస్వాములుగా ఉన్న వారంతా సభ్యులను ఆకర్షించేందుకు రహస్య సమావేశాలు నిర్వహించడం పరిపాటిగా మారింది. ఇదివరకు అరెస్టయిన వ్యక్తులతో సహా పలువురు కుట్రదారులు గత 8 నెలలుగా పలు చోట్ల రహస్యంగా సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇందులో భాగంగా ఇప్పటికే నాలుగు వేర్వేరు దేశాలకు వెళ్లినట్లు విచారణలో వెల్లడైంది. విదేశీ ప్రయాణాలను సైతం తమ ప్రచారంలో ఓ ప్రధాన ఆకర్షణగా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల చాలామంది సులభంగా వీరి మాటలు నమ్మి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణాలు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయని, మరింత సమాచారం సేకరించేందుకు అధికారులు సంబంధిత ఏజెన్సీలతో కలిసి ప్రయత్నాలు ముమ్మరం చేశామని పోలీసువర్గాలు వెల్లడిస్తున్నాయి. కాగా.. మొత్తం వ్యవహారంలో ప్రధాన కుట్రదారు బ్రిజ్ మోహన్ సింగ్ అని గుర్తించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఇతడిపై ఇప్పటికే పలు కేసులు నమోదైనట్లు చెప్తున్నారు.

బాధితులు ముందుకురావాలి:

జానకి షర్మిల, ఎస్పీ, నిర్మల్

విచారణ, దర్యాప్తు పూర్తి పారదర్శకంగా కొనసాగుతోంది. బాధితులు ముందుకొచ్చి వివరాలు అందజేస్తే రికవరీ ప్రక్రియ వేగవంతం చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. పోలీసులు సంప్రదించేవరకు చూడకుండా స్వచ్ఛందంగా ముందుకురావాలి. మోసపోయిన సొమ్మును రికవరీ చేసేందుకు, అసలైన యజమానులకు అప్పగించేందుకు చట్టపరమైన విధానాలు అవలంబిస్తున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. యూబిట్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా నేరుగా తమను సంప్రదించాలి. దర్యాప్తు అధికారి అవినాశ్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక బృందం విచారణ కొనసాగిస్తోంది.

సాధారణ వర్షపాతం.. సాగుకు ఊతం



నిండుకుండలా ఎల్లంపల్లి

నైరుతి రుతు పవనాలు రాష్ట్రం నుంచి నిష్క్రమించాయి. దీని ప్రభావంతో జూన్ రెండో వారం నుంచి ఇటీవలి వరకు వానలు కురిశాయి. సుమారు మూడున్నర నెలలపాటు కురిసిన వర్షం ఉమ్మడి జిల్లాలో సాధారణంగా ఉండగా నిర్మల్ జిల్లాలో మాత్రం సాధారణం కంటే ఒక శాతం ఎక్కువగా కురిసింది. ఆగస్టు రెండో వారం వరకు లోటు వర్షపాతం నెలకొన్నప్పటికీ ఆ తర్వాత తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో సగటున సాధారణ వర్షం నెలకొంది. జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి నైరుతి ప్రవేశించగా జూన్ 15 నుంచి పూర్తి స్థాయిలో విస్తరించింది. సెప్టెంబరు 23 వరకు నిష్క్రమించాయి. ఈ సారి కురిసిన వానలతో జలాశయాలు, నీటి వనరుల్లోకి సమృద్ధిగా నీరు చేరడంతో సాగుకు ఊతమిచ్చింది.

-న్యూస్‌టుడే, మంచిర్యాల వ్యవసాయం



దండేపల్లి శివారులో సాగవుతున్న వరి

జలాశయాలకు జలకళ

నైరుతితో కురిసిన వానలకు ఉమ్మడి జిల్లాలోని పలు జలాశయాలు, చెరువులు, ఇతర నీటి వనరులు జలకళను సంతరించుకున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని సాత్నాల, మత్తడి నిర్మల్ జిల్లాలోని కడెం, స్వర్ణ, శ్రీరాం సాగర్, సుద్దవాగు, మంచిర్యాల జిల్లాలోని ఎల్లంపల్లి, ర్యాలీ, గొల్లవాగు, నీల్వాయి, కుమురంభీం జిల్లాలోని పీపీ జలాశయం, అడ, వట్టివాగు తదితర జలాశయాల్లోకి భారీగా నీరు చేరడంతోపాటు చెరువులు, వాగులు, ఇతర నీటి వనరులన్నీ జలకళను సంతరించుకున్నాయి. ఇవి పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకున్నాయి.


పచ్చని పంటలతో కళకళ..

నీటి వనరుల్లోకి సమృద్ధిగా నీరు చేరడంతో సాగు ఇబ్బందులు తొలగాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో పత్తి, సోయాబీన్, మిగతా మూడు జిల్లాల్లో పత్తి, వరి పంటలు ప్రధానంగా సాగవుతున్నాయి. పప్పుదినుసులు, మొక్కజొన్న కొంత మేర సాగు చేస్తున్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో ఏడు శాతం అధికం



నైరుతి ప్రభావంతో ఆదిలాబాద్ జిల్లాలో వానాకాలం సీజన్‌లో సాధారణ వర్షపాతం 969.7 మిల్లీమీటర్లుకాగా 1041. మి.మీ నమోదైంది. ఇంద్రవెల్లి, గుడిహత్నూరు, ఆదిలాబాద్ గ్రామీణం, అర్బన్, తాంసి మండలాల్లో అధిక వర్షపాతం నమోదుకాగా మిగతా మండలాల్లో సాధారణం కంటే 20 శాతం తక్కువగా నమోదైంది.



మంచిర్యాల జిల్లాలోని మూడు మండలాల్లో ..



మంచిర్యాల జిల్లాలోని కాసిపేట, కన్నెపల్లి, కోటపల్లి మండలాల్లో 20 శాతానికి మించి మిగులు వర్షపాతం నమోదుకాగా మిగతా 15 మండలాల్లో సాధారణ వర్షపాతం నెలకొంది. సీజన్‌లో సాధారణ వర్షపాతం 913.0 మి.మీకాగా 967.3 మి.మీ నమోదైంది. ఆరు శాతం అధికంగా ఉంది.

కుమురంభీంలో 14 శాతం..



కుమురంభీం జిల్లాలో 14 శాతం అధికంగా నమోదైంది. జైనూర్, వాంకిడి, కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేటలో మిగులు వర్షపాతం నమోదుకాగా మిగతా మండలాల్లో సాధారణం నెలకొంది. సాధారణం 999.6 మి.మీకాగా 1144.4 మి.మీ అంటే 14 శాతం అధికంగా నమోదైంది..

నిర్మల్ జిల్లాలో ఇలా..



ఉమ్మడి జిల్లాలోని 19 మండలాలకు పది మండలాల్లో అధిక వర్షపాతం నమోదుకాగా కుభీరు, తానూరు, భైంసా, కుంటాల, నర్సాపూర్-జి, సారంగాపూర్, సోన్, ఖానాపూర్, దస్తూరాబాద్ మండలాల్లో సాధారణం నెలకొంది. సాధారణం 881.8 మి.మీకాగా 1061.7 మి.మీ అంటే 20 శాతం అధికంగా నమోదైంది.

యజమాని లేకున్నా ఇంటికి చేరుకుంటాం



పంట సాగులో తోడుగా నిలిచే ఎడ్లు తమ యజమాని వెంట లేకపోయినా ఎడ్లబండిని ఇంటికి తీసుకెళ్లడం విశేషం. యజమాని ఇంటికి వెళ్లే దారి అలవాటు ఉండటంతో తోడుగా రైతు లేకుండానే నేరుగా ఇంటికి వెళ్తున్నాయి. ఇంద్రవెల్లి మండలం సమాక పంచాయతీ పరిధిలోని పాటగూడ గ్రామానికి చెందిన రైతు కుర్ర రాజేశ్వర్‌కు ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని పోతగూడ గ్రామ శివారులో సాగు భూమి ఉంది. సాయంకాలం సమయంలో రైతు ఎడ్లబండిపై పచ్చి గడ్డిని వేసి, బండి వెనకాల లేగదూడను కట్టి చేలో రోజంతా పని చేసిన ఎడ్లను ఇంటి దారి పట్టించారు. మూడు కి.మీ దూరంలోని యజమాని ఇంటికి వెళ్తూ.. అడ్డువచ్చిన వాహనాలను తప్పించుకుంటూ ఇలా వెళ్తున్న చిత్రాలను బుధవారం 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. - న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

● పట్టుబడ్డ సరకు విలువ రూ.2.25 కోట్లు

తలమడుగు, న్యూస్‌టుడే : తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద బుధవారం 292 ప్యాకెట్లలోని 9 క్వింటాళ్ల గంజాయి, కంటైనర్‌ను పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పీ గౌష్ ఆలం వెల్లడించారు. సరకు విలువ రూ.2.25 కోట్లు ఉంటుందన్నారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతం నుంచి వరంగల్, కరీంనగర్ మీదుగా తెలంగాణ, మహారాష్ట్రలతో పాటు ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను పట్టుకున్నట్లు వివరించారు. ఇద్దరిని అరెస్టు చేసి 8 మందిపై కేసు నమోదు చేశామన్నారు. తలమడుగు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఆంధ్రా, ఒడిశా నుంచి పెద్ద ఎత్తున గంజాయి తరలుతోందని ముందస్తు సమాచారంతో ఉదయం అంత్రరాష్ట్ర రహదారి లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. ఉత్తరాఖండ్‌కు చెందిన ఐచర్ కంటైనర్ వాహనం ఆదిలాబాద్ పట్టణం వైపు నుంచి మహారాష్ట్ర వెళ్తోంది. ఈ క్రమంలో వాహనాన్ని చెక్‌పోస్టు సమీపంలో తనిఖీ చేయగా అందులో 9 క్వింటాళ్ల గంజాయిని, డ్రైవర్ వసీం, క్లీనర్ అర్మాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు ఉత్తరాఖండ్ హరిద్వార్‌కు చెందిన అన్సుజైన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన పండిత్, సోను అన్సారి గంజాయి వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్, సుక్మా జగదల్‌పూర్ జిల్లాల అటవీ ప్రాంతం నుంచి గంజాయిని పైన పేర్కొన్న ముగ్గురికి డ్రైవర్, క్లీనర్‌లు సరఫరా చేస్తున్నారని వివరించారు. ఆంధ్రా - ఒడిశా అటవీ ప్రాంతంలో 900 కిలోల గంజాయి ఉందని దానిని మహారాష్ట్రలోని బుల్డానా, దూలే జిల్లాలకు తరలించేందుకు వారు రూ.1,50,000 ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆదిలాబాద్ నుంచి తలమడుగు మండలం మీదుగా మహారాష్ట్ర వెళ్తుండగా పక్కా ప్రణాళికతో పట్టుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంత పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడటం ఇదే మొదటిసారన్నారు. అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ సురేందర్‌రెడ్డి, గ్రామీణ సీఐ ఫణిందర్‌ను ఎస్పీ అభినందించారు. వారితో పాటు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, జైనథ్ సీఐడి సాయినాథ్, ఎస్సైలు అంజమ్మ, ముజాహిద్, విష్ణువర్ధన్‌లను అభినందించి నగదు బహుమతి అందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

బడుల పర్యవేక్షణ ఇక సులువు

● మండలానికో ఇన్‌ఛార్జి ఎంఈవో నియామకం

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: మండలంలో విధులు నిర్వహించే సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిని అదే మండలానికి ఇన్‌ఛార్జి ఎంఈఓగా బాధ్యతలు అప్పగించారు. ఒక్కో ఎంఈఓ నాలుగైదు మండలాలకు ఇన్‌ఛార్జిగా కొనసాగడంతో కొన్నేళ్లుగా పాలన, పర్యవేక్షణపరంగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించింది. జిల్లాలో రెగ్యులర్ ఎంఈవో ఒక్కరు కూడా లేరు. మొత్తం 19 మండలాలకు ఆరుగురు సీనియర్ జీహెచ్‌ఎంలే ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించారు. వారికి సైతం అత్యధిక మండలాలు ఉండటంతో దూరభారం, పూర్తి స్థాయి పర్యవేక్షణ లేక ఇక్కట్లు ఎదుర్కొన్నారు. పంచాయతీరాజ్, ప్రభుత్వ ఉపాధ్యాయల మధ్య సర్వీసుపరంగా నెలకొన్న న్యాయపరమైన చిక్కులతో గతంలో ఇన్‌ఛార్జి ఎంఈఓలుగా ఉన్న వారికే మరికొన్ని మండలాల బాధ్యతలు ఇస్తూ వస్తున్నారు. దీనిపై ఎదురవుతున్న ఇబ్బందులను సమీక్షించిన ప్రభుత్వం మండలంలోని సీనియర్ గెజిటెడ్ హెచ్‌ఎంకు సంబంధిత మండల ఇన్‌ఛార్జిగా అదనపు బాధ్యతలు ఇవ్వాలని నిర్ణయించింది.

నియమితులైన ప్రధానోపాధ్యాయులు వీరే..

మండలం	పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న ఉన్నత పాఠశాల
భైంసా	ఎ.సుభాష్	కామోల్
కుభీరు	విజయ్‌కుమార్	నిగ్వ
ముథోల్	జి.రమణారెడ్డి	ఆష్టా
సారంగాపూర్	జి.మధుసూదన్	చించోలి(బి)
కుంటాల	వి.ముత్యం	కుంటాల
దిలావర్‌పూర్	కె.శంకర్	గుండంపల్లి
తానూరు	బి.నరేందర్	ఎల్వి
లోకేశ్వరం	బి.చంద్రకాంత్	మన్మద్
బాసర	జి.మైసాజి	బాసర
లక్ష్మణచాంద	ఆర్.అశోక్‌వర్మ	వడ్యాల్
మామడ	వెంకటరమణారెడ్డి	కొరిటికల్
నర్సాపూర్(జి)	ఎం.కిషన్‌రావు	నర్సాపూర్(జి)
పెంబి	జి.రాంచందర్	పెంబి
ఖానాపూర్	ఎ.ప్రేంసాగర్	సత్తనపల్లి
కడెం	షేక్ హుస్సేన్	పాతమద్దిపడగ
దస్తూరాబాద్	టి.గంగాధర్	దస్తూరాబాద్
నిర్మల్ అర్బన్	జి.నాగేశ్వర్‌రావు	ఆస్రాకాలనీ, నిర్మల్
నిర్మల్ గ్రామీణం	పి.వెంకటేశ్వర్	చిట్యాల్
సోన్	టి.పరమేశ్వర్	జాఫ్రాపూర్

బాధ్యతలు విజయవంతంగా నిర్వహించాలి



ఇన్‌ఛార్జి ఎంఈవోలతో మాట్లాడుతున్న డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం, రాష్ట్ర ఉన్నతాధికారులు ఇచ్చిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించి పాఠశాలల బలోపేతం కోసం కృషి చేయాలని డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని శాఖ తన కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంఈవోలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు ఆరుగురు విధులు నిర్వహించగా, అదనంగా 13 మందిని నియమించారని చెప్పారు. తమ మండల పరిధిలోని పాఠశాలలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. విద్యాపరమైన కార్యక్రమాలను జయప్రదం చేయాలని, ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ నివేదికలను రూపొందించాలని వెల్లడించారు. మన ఊరు-మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, జాతీయ సాధన సర్వే పరీక్ష, ఉమ్మడి జిల్లా పరీక్షలు, పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం నిర్వహణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు తదితర వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా...

నిర్మల్ 97053 46693
భైంసా 63099 94649
ఖానాపూర్ 96401 62091


ధర్మోర సమీపంలో గుంతలమయంగా మారిన రహదారి

? ధర్మోరా నుంచి వట్టోలి మీదుగా అబ్దుల్లాపూర్, ముథోల్ వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. - రాజు, ధర్మోర

✓ పంచగుడి నుంచి విరోలి తండా వరకు రహదారి నిర్మాణానికి టెండరు ప్రక్రియ పూర్తయింది. దసరా తర్వాత పనులు ప్రారంభించే అవకాశం ఉంది. - రఘు, ఏఈ, ఆర్అండ్‌బీ శాఖ

–న్యూస్‌టుడే, లోకేశ్వరం

వృద్ధురాలికి చేయూత

వందనం

నిర్మల్: పట్టణంలోని గొల్లపేట్‌కు చెందిన 71 ఏళ్ల వృద్ధురాలు సిద్ధ లక్ష్మి నడవలేని స్థితిలో ఉన్నా పింఛన్ రావడం లేదు. నడవలేని స్థితిలో ఉన్న ఆమె గత సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి అధికారులకు మొర పెట్టుకున్న విషయమై మంగళవారం 'ఈనాడు'లో 'ఎంత కష్టం.. ఎన్ని అవస్థలు' శీర్షికన ప్రచురితమైన వార్తకు బుధవారం స్థానిక ఇంద్రానగర్‌లోని శ్రీవిద్యానికేతన్ ఒలంపియాడ్ ప్రిన్సిపల్ శ్యాంప్రకాశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు స్పందించారు. తలా కొంత నగదు జమచేశారు. నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, రూ.వెయ్యి ఆర్థిక సాయం బుధవారం ఆ వృద్ధురాలికి ఇంటికి వెళ్లి అందజేశారు.

అటవీ సంరక్షణ చట్టాలు పకడ్బందీగా అమలు

ఖానాపూర్, న్యూస్‌టుడే : అడవుల అభివృద్ధి, రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఐఎఫ్ఎస్ అధికారి (కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అండ్ ఎఫ్‌డీపీటీ) ఎస్.శాంతారామ్ అన్నారు. పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయంలో బుధవారం నిర్మల్ డీఎఫ్‌వో నగీనా భాను, ఖానాపూర్ ఎఫ్‌డీవో గౌరీశంకర్, కవ్వాల్ టైగర్ రిజర్వు పరిధిలోని ఎఫ్ఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖానాపూర్ అటవీ డివిజన్ పరిధిలో చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఖానాపూర్, పెంబి, కడెం, ఉడుంపూర్ ఎఫ్ఆర్వోలు కిరణ్, రమేష్‌రావ్, గీతారాణి, అనిత, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

భైంసా: స్త్రీశిశు సంక్షేమశాఖ రాష్ట్ర పరిశీలన అధికారులు బుధవారం పట్టణంలోని ఒవైసీనగర్ 5వ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అంతర్గత పరిశీలనలో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శిస్తున్నట్టు పరిశీలన బృందం అధికారి ప్రదీప్ తెలిపారు. చిన్నారుల ఆరోగ్య, భౌతిక, శారీరక ఎదుగుదల, బరువు వివరాల రికార్డులు పరిశీలించారు. ఎత్తు, బరువు సరిచూసుకున్నారు. రికార్డుల వివరాల మేరకు పౌష్టికాహారం అందుతోందా లేదా అని తెలుసుకున్నారు. గుడ్లు అందుబాటులో లేక పోవడంతో సరఫరాపై ఆరా తీశారు. శ్రావణ్, శ్రీనివాస్, పర్యవేక్షకురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయురాలు జయశ్రీ ఉన్నారు.


కోలాటమేస్తున్న యువతి


జానపద గేయంపై యువతుల నృత్యం


జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో అదనపు పాలనాధికారి (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్


జానపద నృత్యం చేస్తున్న జంట

అలరించిన ఆట.. పాట

● ముగిసిన జిల్లాస్థాయి యువజనోత్సవ పోటీలు

నిర్మల్, న్యూస్‌టుడే: జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో తొమ్మిది అంశాల్లో నిర్వహించిన పోటీల ప్రారంభ, ముగింపు కార్యక్రమానికి హాజరైన జిల్లా అదనపు పాలనాధికారి ఫైజాన్ అహ్మద్ విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువత ఆట, పాటలతో అలరించారు. అందమైన బొమ్మలు గీసి ఆకట్టుకున్నారు. రాసిన కథలు, వినిపించిన కవితలు, ఉపన్యాసం ప్రముఖుల ప్రశంసలు అందుకున్నాయి. హస్తకళల నైపుణ్యాన్ని చూపించారు. ఫోక్ డ్యాన్స్ గ్రూపు విభాగంలో ఎ.సాహిత్య బృందం (ప్రథమ, టీజీఆర్ఎస్, సోఫినగర్, నిర్మల్), తార బృందం (ద్వితీయ, నిర్మల్), ఫోక్ డ్యాన్స్ సోలో విభాగంలో ఎన్.నిహారిక (ప్రథమ), బన్ని ద్వితీయ (నిర్మల్), ఫోక్ సాంగ్ గ్రూపు విభాగంలో మంజుల బృందం (ప్రథమ), సాయికృప బృందం (ద్వితీయ), సోలో విభాగంలో కె.స్వామి, బి.సాయికృప (నిర్మల్), ఉపన్యాస విభాగంలో జి.తనుశ్రీ (ప్రథమ, టీఎస్ఆర్‌జేసీ, సోఫినగర్), ఎ.అకాంక్షరెడ్డి (ద్వితీయ, ఆదర్శనగర్), ఎస్.మీనాక్షి (తృతీయ, కేజీబీవీ, దిలావర్‌పూర్), స్టోరీ రైటింగ్ విభాగంలో ఎస్.మీనాక్షి (ప్రథమ), ఆర్.మహేశ్వరి (ద్వితీయ), జె.జైశ్రీ (తృతీయ), కవిత్వంలో ప్రథమ, ద్వితీయ జి.తనుశ్రీ, ఎన్.నవ్యశ్రీ (టీఎస్ఆర్‌జేసీ, సోఫినగర్) కె.మహిత్‌రెడ్డి (తృతీయ-ఫ్లేయర్ హైస్కూల్, సిర్గాపూర్), చిత్రలేఖనం విభాగంలో ఎస్.నిఖిత (ప్రథమ), ఎస్.నవ్యశ్రీ (ద్వితీయ), ఎస్.మనీష (తృతీయ), బి.తేజేశ్ (నాలుగో), ధరణి (అయిదో) స్థానాల్లో నిలిచారు. హస్తకళ, ఆగ్రో ఉత్పత్తుల విభాగంలో ఎ.పూజ (ప్రథమ, ఫ్లేయర్ హైస్కూల్, సిర్గాపూర్), ఎం.రేఖ (ద్వితీయ, కేజీబీవీ, దిలావర్‌పూర్), కె.దీప్తి (తృతీయ, ఫ్లేయర్ హైస్కూల్, సిర్గాపూర్) స్థానాల్లో నిలిచారు. జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి, యువజన, క్రీడల అభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ కళాకారులు జోసెఫ్‌బాబురావు, ఎలిశెట్టి సుదర్శన్, కడారి రఘునాథ్, చెనగారెపు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



చకచకా చేతిపంపు మరమ్మతులు చేపట్టాలే..


చేతిపుంపు మరమ్మతుల శిక్షణను పరిశీలిస్తున్న మండల అధికారులు

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే: రక్షితనీటి పథకం నిర్వహణ, పంపుసెట్ల మరమ్మతులు సకాలంలో చేపట్టాలని ఎంపీడీవో అరుణకుమారి అన్నారు. దిలావర్‌పూర్‌లో మూడు రోజులుగా నర్సాపూర్(జి), దిలావర్‌పూర్ మండలాల మల్టీపర్పస్ కార్మికులకు శిక్షణ కొనసాగిస్తున్నారు. బుధవారం చేతిపంపు మరమ్మతుల శిక్షణ కార్యక్రమంలో శిక్షణకేంద్రంలోనే మెకానిక్‌లు చేతిపంపు ఏర్పాటు చేసి అది పనిచేసే విధానం, సాధారణంగా వచ్చే సమస్యలపై కార్మికులకు తర్ఫీదు నిచ్చారు. ఎంపీవో గోవర్ధన్, ఏఈ రాజశేఖర్‌లు శిక్షణలో పాల్గొని పలు సూచనలు అందించారు.


ప్రవచిస్తున్న శివానంద భారతిస్వామి

రామ కోటి సంపూర్ణం

నర్సాపూర్ (జి), న్యూస్‌టుడే: రామాలయంలో ఈ నెల 19న ప్రారంభమైన రామకోటి కార్యక్రమంలో కోటి రామ జపం బుధవారం పూర్తయినట్లు శివానంద భారతి స్వామి తెలిపారు. ఆధ్యాత్మికతతోనే మానవునికి ప్రశాంతత లభిస్తుందని, శ్రీ రాముని గుణాలను జీవితంలో అన్వయించుకోవాలని సూచించారు. రామ నామ స్మరణతో భజనలు చేస్తూ మహిళలు నృత్యం చేశారు. కార్యక్రమంలో రామానందభారతి స్వామి, ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగారెడ్డి, నారాయణ, పి.గంగారాం, గంగారెడ్డి, పాపెన్ రాజేశ్వర్, విశ్వనాథం, భజన మండలి సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సార్లు లేకుంటే చదువెవరు చెబుతారు?

ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గోసంపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉన్న ఒక్క ఉపాధ్యాయుడు సెలవు పెట్టడంతో విద్యార్థులు ఆరుబయట కనిపించడంతో బుధవారం గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాత ఎల్లాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు రమాదేవికి ఫిర్యాదుచేశారు. దీంతో గోసంపల్లె పాఠశాలకు వచ్చిన ఆమెకు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సుమారు 70మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో గతంలో నలుగురు ఉపాధ్యాయులు ఉండేవారని ఇప్పుడు ఒకే ఉపాధ్యాయుడితో పిల్లల చదువు ఎలా సాగుతుందని ప్రశ్నించారు. పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారిందని పేర్కొన్నారు. ఉన్న ఉపాధ్యాయుడు విద్యార్థులను కొడుతున్నారని, పాఠశాలకు విద్యా కమిటీ ఛైర్మన్‌ను రానివ్వడంలేదని ఆరోపించారు. గ్రామస్థులు కరిపె రాజ్‌కుమార్, టేకు ప్రకాష్, గంగారాం, తిరుపతి, బేబి, రాజేశ్వర్, విమల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

పొదుపుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

లక్ష్మణచాంద: విద్యార్థి దశలో పొదుపు అలవాటు చేసుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆర్బీఐ ఏజీఎం రెహమాన్ అన్నారు. బుధవారం లక్ష్మణచాంద ఎస్‌వీజీ డిగ్రీ, సహకార జూనియర్ కళాశాలలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. కళాశాల ఆవరణలో మొక్క నాటారు. బీమా పథకాలు, మహిళా సురక్షణ యోజన, పొదుపు వల్ల కలిగే లాభాలను వివరించారు. ఎల్‌డీఎం రాంగోపాల్, ఆర్బీఐ డీవీఎస్ రామారావు, ఎస్ఎంబీ విలాస్, బీఎం మహేశ్వర్‌రెడ్డి, ఎఫ్ఎల్‌సీ రాంగోపాల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ భోజన్న, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


పరిమండల్‌లో పౌష్టికాహార పదార్థాల గురించి వివరిస్తున్న అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు

పౌష్టికాహారంపై అవగాహన

మామడ: మండలంలోని పరిమండల్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాస మహోత్సవం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం గురించి అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు ప్రసాద వివరించారు. పోషకాలు లభించే పదార్థాలను ప్రదర్శించారు.

నియామకం

కడెం: మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కడెంకు చెందిన ఆర్ల రమేష్‌ను నియమించారు. ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు వి.ఎల్ రాజు నుంచి ఈమేరకు రమేష్ నియామక ఉత్తర్వును అందుకున్నారు.

పాఠశాలకు విద్యుత్తు మోటారు వితరణ

భైంసా గ్రామీణం: మండలంలోని వానల్‌పాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విద్యుత్తు మోటారును మంగాయి సందీప్ బుధవారం వితరణ చేశారు. మోటారు చెడిపోయి పాఠశాలలో నీటి సమస్య ఏర్పడింది. ఈ సమస్యను మాజీ సర్పంచి దృష్టికి తీసుకెళ్లగా సమాచారం తెలుసుకున్న లోకేశ్వరం మండలం బిలోలి వాసి సందీప్ రూ.11 వేల విలువగల మోటారును పాఠశాలకు అందించారని ప్రధానోపాధ్యాయుడు పి.గంగాధర్ చెప్పారు.


నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి


మామడ మండలం దిమ్మదుర్తిలో..


కుంటాలలో విద్యార్థులు..


భైంసాలో భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు టి.శ్రీనివాస్, నాయకులు


ఖానాపూర్‌లో భాజపా నాయకులు

దీన్‌దయాళ్ సేవలు శ్లాఘనీయం

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతూ అంత్యోదయ విధానాన్ని విశ్వసించిన మహనీయుడు పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక నివాసంలో, భాజపా కార్యాలయంలో బుధవారం వేర్వేరుగా నిర్వహించిన జయంతి వేడుకల్లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన స్వదేశీ, స్వావలంబన విధానం బలపర్చారన్నారు. వారి సేవలను స్మరిస్తూ జిల్లా కేంద్రంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, శ్యామాప్రసాద్ ముఖర్జీ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కేంద్రమంత్రులతో త్వరలోనే వాటిని ప్రారంభిస్తామని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, మెడిసెమ్మె రాజు, సత్యనారాయణగౌడ్, రాచకొండ సాగర్, అర్జున్, అలివేలు మంగ, అయ్యన్నగారి రాజేందర్, నూతుల భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

✤ జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో దీన్‌దయాళ్ జయంతి నిర్వహించారు.


కుభీరులో..

వెంటనే చర్యలు తీసుకోవాలి

ముథోల్(బాసర): తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిని వెంటనే శిక్షించాలని బుధవారం ముథోల్ భాజపా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ముథోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యులు లక్ష్మీనారాయణ, భూమేష్ భాజపా నాయకులు తాటివార్‌రమేష్, సాయినాథ్, మోహన్‌యాదవ్, జీవన్, తదితరులున్నారు.

పెంబి: తిరుపతిలో లడ్డూ అపవిత్రతకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని జనసేన పార్టీ నాయకులు బుధవారం తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. రాజు, ప్రవీణ్, సతీష్, నరేందర్ పాల్గొన్నారు.

సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే మేలు

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సకాలంలో సంరక్షణ చర్యలు చేపడితే పంటలకు మేలు చేకూరుతుందని ముథోల్ ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నర్సయ్య అన్నారు. మండలంలోని తిమ్మాపూర్‌లో బుధవారం వరి, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మోతాదుకు మించి నత్రజని వాడితే నష్టం జరుగుతుందని అన్నారు. వరిలో ఆకు ఎండు తెగుళ్ల ఉద్ధృతి కొనసాగుతోందని నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. నేరుగా విత్తే విధానంలో సాగు చేసిన వరి పైరును పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డా.కార్తీక్, డీఏఓ అంజిప్రసాద్, ఏఓ గణేష్, ఏఈఓ లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.


తిమ్మాపూర్‌లో వరి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

'అక్రమ నిర్మాణాలను తొలగించాలి'

నిర్మల్: పట్టణంలోని దివ్యనగర్ అయ్యప్పస్వామి ఆలయం ఎదురుగాఉన్న 524 సర్వేనెంబరులోని ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంటోళ్ల వెంకటస్వామి అన్నారు. ఈ స్థలంలో అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటుచేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కతో పాటు జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఆ నిర్మాణాలను తొలగించనట్లయితే తామే తీసేస్తామని చెప్పారు.

సభ్యత్వ నమోదు పెద్ద ఎత్తున చేపట్టండి

నిర్మల్ అర్బన్: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మహిళా సభ్యత్వ నమోదును పెద్ద ఎత్తున చేపట్టి, కమిటీలు ఏర్పాటు చేయాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. బుధవారం నిర్మల్‌లోని ఆయన నివాస గృహంలో పార్టీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి శ్రీహరిరావును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 10 వరకు కమిటీలు వేయాలని చెప్పారు.

నిబంధనల మేరకే ఆసుపత్రులు నిర్వహించాలి

కడెం: ఆసుపత్రులను నిబంధనల మేరకు నిర్వహించాలని. లేకుంటే చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి రాజేందర్ అన్నారు. బుధవారం ఆయన కడెంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేశారు. సరైన అర్హతలు లేకుండా, రిజిస్ట్రేషన్ చేసుకోకుండా చికిత్సలు చేస్తున్న ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్, కార్యక్రమ నిర్వహణ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేర వార్తలు

ఉరేసుకుని రైతు ఆత్మహత్య


నగేశ్

తానూరు(భైంసా), న్యూస్‌టుడే : మండలంలోని నంద్‌గాం గ్రామానికి చెందిన రైతు బొంతేవాడ్ నగేశ్(45) బుధవారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబీకులు, ఎస్సై డి.రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నగేశ్ కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. దీంతో మద్యానికి బానిసయ్యారు. ఉదయం కడుపునొప్పి రావడంతో జీవితంపై విరక్తితో సొంత చేనులో వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆటోను ఢీకొట్టిన టిప్పర్.. పలువురికి గాయాలు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర మండలం బిద్రెల్లి పెట్రోల్ బంకు సమీపంలో బుధవారం వేకువజామున ఆటోను టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తానూరు మండలం కల్యాణి తండా వాసులు కైలాస్, సంతోష్, యోగేష్, గంగాధర్ బాసర నుంచి రైలులో తిరుపతి వెళ్లడానికి ఆటోలో బయలుదేరారు. బిద్రెల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పరు ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భైంసాలో మరో చోరీ

భైంసా: పట్టణంలో మరో చోరీ ఘటన చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కుంట ప్రాంతం బైల్ బజార్ సమీపంలో నివాసం ఉంటున్న మాదొల్ల గట్టు మంగళవారం రాత్రి ఇంటికి తాళం వేసి ఆసుపత్రికి వెళ్లారు. తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని ఆరు మాసాల బంగారు వస్తువులు, రూ.30వేల నగదు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై పట్టణ సీఐ డి.రాజారెడ్డిని సంప్రదించగా ఫిర్యాదు వచ్చిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నియంత్రికలోని రాగి తీగ అపహరణ

ముథోల్(బాసర): బాసర మండలంలోని బిద్రెల్లి గ్రామానికి చెందిన గంగాధర్ రైతు వ్యవసాయ క్షేత్రంలో ఉన్న విద్యుత్తు నియంత్రికను మంగళవారం రాత్రి పగులగొట్టి అందులోని రాగి తీగలను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన రైతు గమనించి వెంటనే విద్యుత్తు అధికారులకు సమాచారం అందించారు. వారు పరిశీలించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వట్టి వేళ్లతో లాభాలనేకం

కడెం, న్యూస్‌టుడే: లాభదాయకమైన వట్టి వేళ్ల మొక్కలను సాగుచేసుకోవడం ఉపయోగకరమని డీఆర్డీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మద్దిపడిగలో వైకుంఠధామం ఆవరణలోని ఖాళీ స్థలంలో ఈగడ్డి మొక్కలను నాటించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈగడ్డి గుబురుగా పెరుగుతుందని, గడ్డి వేళ్లలో ఔషధ గుణాలుంటాయని, సుగంధ ద్రవ్యాల్లోనూ వాడుతారని డీఆర్డీఓ వివరించారు. లాభం చేకూర్చే ఈగడ్డి సాగుపట్ల రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఏపీఓ జయదేవ్, ఏపీఎం రాజారాం, సిబ్బంది పాల్గొన్నారు.


వార్షిక శిబిరంలో పాల్గొన్న కేడెట్లతో ఎన్‌సీసీ అధికారి

పొన్కల్ ఎన్‌సీసీ కేడెట్ల ప్రతిభ

మామడ, న్యూస్‌టుడే: మండలంలోని పొన్కల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు ఆదిలాబాద్‌లో జరిగిన వార్షిక శిబిరంలో జిల్లా స్థాయిలో పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. సాంస్కృతిక అంశాల్లో రుచిత, స్మితిక, హేమలత, క్రీడాపోటీల్లో లావణ్య, ఫైరింగ్‌లో చరణ్ బహుమతులు అందుకున్నట్లు ప్రధానోపాధ్యాయుడు అరవింద్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి పూర్ణచందర్ తెలిపారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ విద్యార్థులను అభినందించారు.

సంక్షిప్త సమాచారం

విద్యా సామగ్రి వితరణ

సారంగాపూర్: మండలంలోని రవీంద్రనగర్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు బుధవారం అడెల్లి మాజీ సర్పంచి సముద్రాల సుచరిత రాజేశ్వర్‌రావు దంపతులు విద్య సామగ్రిని విరాళంగా ఇచ్చారు. వారి కుమారుడు రాహుల్ వర్ధంతిని పురస్కరించుకొని 50 మంది విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, బ్యాగులు, నీటి సీసాలు, పెన్నులను అందించారు.

కార్మికులకు సురక్షా కవచాల పంపిణీ

ఖానాపూర్ గ్రామీణం: మండలంలోని సింగాపూర్, రాజూర, దాస్‌నాయక్ తండా గ్రామాలలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో రత్నాకర్‌రావు పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఆయా గ్రామాలలో కార్మికులకు సురక్షా కవచాలను పంపిణీ చేశారు.

స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి

దిలావర్‌పూర్: పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీవో గోవర్ధన్ అన్నారు. బుధవారం దిలావర్‌పూర్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి తడి, పొడి చెత్తసేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నివారణకు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలేకుండా చూసుకోవాలని తెలిపారు. ఈవో చంద్రశేఖర్, ఉపాధిహామీ క్షేత్ర సహాయకుడు శ్రీనివాస్, ఐకేపీ సంఘ సభ్యులు, మండల వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫార్మసీ దినోత్సవం

నిర్మల్ గ్రామీణం: ప్రపంచ ఫార్మసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బోధనాసుపత్రిలో బుధవారం ఫార్మసిస్టులు వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఫార్మసిస్టులకు వైద్యులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కోసి పంచారు.

నిధులు మంజూరు చేయించండి

భైంసా గ్రామీణం: తమ కుల సంఘం భవన నిర్మాణానికి నిధులు ఇప్పించాలని తానూరు మండలం కోలూరు ఎస్సీ సంఘం నాయకులు బుధవారం భైంసా మండలం దేగాం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. నాయకులు జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ రాజన్న, శ్రీనివాస్‌రెడ్డి, తుల సిరామ్, శ్రావణ్, లక్ష్మణ్, అహ్మద్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.